క్లుప్తంగా

రంజాన్ వేళ.. పేదలకు అన్నదానం



పేదలకు ఆహారం ప్యాకెట్లు అందిస్తున్న దేవరకొండ మార్కండేయులు

ఎంవీపీకాలనీ: ముస్లింల పవిత్ర మాసం రంజాన్‌ను పురస్కరించుకొని దేవరకొండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు తెలిపారు. ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెం, పెదవాల్తేర్, బీచ్ రోడ్ తదితర ప్రాంతాల్లో పలువురు ముస్లింలతో కలిసి అనాథలకు ఆహారం ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. సమాజంలో మత సామరస్యం ఆవశ్యకతను తెలియజేస్తూ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్నదానం చేపట్టినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి మందిర వార్షికోత్సవం

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లోని షిర్డీసాయిరాం మందిర 27వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ నెల 28న ప్రారంభమైన వేడుకలు ఆదివారంతో ముగిసాయి. వార్షికోత్సవ పూజలతోపాటు ఉగాది సందర్భంగా భక్తులు షిర్డీసాయిబాబాను దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం ఆలయ ఆవరణలో సాయి సామూహిక సత్యవ్రతాలు నిర్వహించారు. ఆదర్శ నగర్, సుందర్‌నగర్ కాలనీల నుంచి అధిక సంఖ్యలో మహిళలు ఈ వ్రతంలో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పల్లకీ సేవ, చావడి ఉత్సవం చేపట్టారు. అనంతరం ఇక్కడ నిర్వహించిన పరస సందడిగా మారింది.


నూకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో నూకాలమ్మ

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో కొలువైన నూకాలమ్మ నెల రోజుల పండగలో భాగంగా తొలి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నెల రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు కొనసాగుతాయన్నారు.

అప్పన్న చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్ విక్రమ్‌కు విరాళం అందిస్తున్న దాత లక్ష్మీనారాయణరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం నగరంలోని ఇసుకతోట ప్రాంతానికి చెందిన లక్ష్మీనారాయణ రావు దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళం అందించారు. సింహగిరి పైనున్న పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్‌కు సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందించారు.

రౌడీయిజం చేస్తే పీడీ యాక్ట్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా సీఐ రమణ

సీతమ్మధార: రౌడీయిజం చేస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని ద్వారకా సీఐ డి.వి.రమణ రౌడీషీటర్లను హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించి వేలి ముద్రలు, సంతకాలు సేకరించారు. సత్ప్రవర్తనతో మెలగకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబంతో హాయిగా జీవించాలని సూచించారు. మీరు చేసే పనులపై నిఘా ఉంటుందని తెలిపారు. ఎస్ఐ శ్రీను, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానం.. పరిశుభ్రం



పాడైన మూత్ర విసర్జన బేసిన్



పెదవాల్తేరులోని ప్రభుత్వ శ్వాసకోశ వ్యాధుల(ఛాతి) వైద్యశాల

- ప్రభుత్వ ఛాతి ఆస్పత్రిలో మూలకు చేరిన మరుగుదొడ్లు
- నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు
- ఇబ్బందులు పడుతున్న రోగులు, వారి బంధువులు



మరుగుదొడ్ల గొళ్లానికి కట్టిన తాళ్లు



ఆస్పత్రి వార్డులో శుభ్రం చేయని మరుగుదొడ్లు | పగుళ్లు వచ్చిన టాయిలెట్

బీచ్‌రోడ్డు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక వెలుగు వెలిగిన ప్రభుత్వ ఆస్పత్రులు ఇప్పుడు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వ అలసత్వమో లేక ఆస్పత్రి పరిపాలన అధికారుల నిర్లక్ష్యమో తెలియదు గాని వైద్యశాలల పరిసరాలు ఘోరంగా తయారయ్యాయి. ముఖ్యంగా ఆస్పత్రుల వార్డుల్లో, బయల రోగులు, వారి బంధువుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు శుభ్రతకు నోచుకోవడం లేదు. ఇందుకు నిదర్శనమే పెదవాల్తేరులోని ప్రభుత్వ ప్రభుత్వ శ్వాసకోశ వ్యాధుల(ఛాతి) ఆస్పత్రి. దీనిలోని మరుగుదొడ్లు ఉపయోగించడానికి వీలు లేకుండా మూలకు చేరాయి.

కానరాని శుభ్రత

ప్రభుత్వ ఛాతి ఆస్పత్రిలోని వార్డుల్లో గల మరుగుదొడ్లు శుభ్రతకు నోచుకోవడం లేదు. ప్రతి వార్డులోనూ మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. పారిశుధ్య సిబ్బంది కనీస శుభ్రత చేసిన దాఖలాలు కనిపించడం లేదు. రోగులు ఆ మరుగుదొడ్లను వినియోగించాలంటే భయపడుతున్నారు. అటుగా ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి షిఫ్ట్‌లో శుభ్రం చేయాల్సిందే..

వార్డులోని మరుగుదొడ్లను పారిశుధ్య సిబ్బంది ప్రతి షిఫ్ట్‌లో శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఈ ఆస్పత్రిలో అటువంటి శుభ్రత కనిపించడం లేదు. రోజుకు ఒకసారి మాత్రమే పారిశుధ్య సిబ్బంది వచ్చి శుభ్రం చేయడం వల్ల దుర్వాసన విపరీతంగా వస్తుంటుంది. అందువల్లే మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని పేషెంట్లు, వారి బంధువులు చెబుతున్నారు.

మరమ్మతులు నిల్

ఛాతి ఆస్పత్రిలోని ప్రతి వార్డులో ఉన్న మరుగుదొడ్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. టాయిలెట్ల బేసిన్లకు ఉండాల్సిన పైపులు లేకపోవడం, బేసిన్లు విరిగిపోవడం వంటివి దర్శనమిస్తాయి. మల, మూత్ర విసర్జనకు వెళ్లాలంటే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం

ఈ ఆస్పత్రి పరిశుభ్రత విషయంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. వార్డులోని మరుగుదొడ్లు కనీసం శుభ్రంగా లేకపోయినా ఆస్పత్రిలో పట్టించుకునే నాథుడే లేడు. వార్డుల్లోకి రౌండ్స్‌కు వెళ్లి పరిశీలించాల్సిన ఉన్నతాధికారులు అసలు రౌండ్స్‌కి వెళ్తున్నారా అనే సందేహం ఈ మరుగుదొడ్లను చూస్తే కలుగుతుంది. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రి పరిశుభ్రతపై దృష్టి సారించాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

వీఎంఆర్‌డీఏ పార్క్ నిర్వహణలో నిర్లక్ష్యం



వీఎంఆర్‌డీఏ పార్క్ ప్రవేశ మార్గంలో పగిలిన గ్రానైట్ పలకలు



పార్క్‌లో స్కేటింగ్ రింక్ పక్కనే సేదతీరుతున్న శునకం

ఏయూక్యాంపస్: నగరంలోని ప్రతిష్టాత్మకమైన పార్కుల్లో ఒకటిగా నిలిచే వీఎంఆర్‌డీఏ పార్క్ నిర్వహణలో నిర్లక్ష్యం తాండవిస్తోంది. పర్యాటకులను ఆకట్టుకునేలా వసతులు కల్పించాల్సిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా పార్క్ అధ్వానంగా తయారైంది. పార్క్‌లోకి ప్రవేశించే ప్రధాన మార్గం పక్కనే వేసిన గ్రానైట్ పలకలు విరిగిపోయాయి. ఆకర్షణీయంగా తీర్చిదిద్దే పనుల్లో భాగంగా ప్రధాన రహదారిని ఆనుకుని ప్రత్యేకమైన గ్రానైట్ పలకలు వేశారు. వీటి మధ్యలో పచ్చగడ్డితో ఆహ్లాదంగా కనిపించేవి. కాలక్రమేణా వీటి నిర్వహణను సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో గ్రానైట్ పలకలు పలు చోట్ల విరిగిపోయి అధ్వానంగా కనిపిస్తున్నాయి. వీటిని మార్చడం, కొత్తవి ఏర్పాటు చేయడంపై అధికారులు దృష్టి సారించడం లేదు. ఈ పార్క్‌కు నిత్యం వందలాది మంది సందర్శకులు వస్తుంటారు. పార్క్ ప్రవేశ మార్గం వద్దే ఇటువంటి పరిస్థితులు వారికి స్వాగతం పలకడంతో కొంత నిరుత్సాహానికి గురవుతున్నారు. వీటిని సరిదిద్దే దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పార్క్‌లో శునకాల విహారం

బీచ్ రోడ్డులోని వీఎంఆర్‌డీఏ పార్క్‌లో శునకాల సంఖ్య పెరిగిపోతోంది. నిత్యం ఐదారు కుక్కలు పార్క్‌లో సంచరిస్తూ సందర్శకులను భయపెడుతున్నాయి. ఇవి వాకింగ్ ట్రాక్‌లు, పార్క్‌లు, స్కేటింగ్ రింక్‌లు, ఫుడ్ స్టాళ్ల వద్ద కనిపిస్తున్నాయి. ఆటలాడుకునే చిన్నారుల వెంట పడుతూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. చిన్నారులు స్వేచ్ఛగా పార్క్ ప్రాంగణంలో తిరిగే పరిస్థితి లేదు. పార్క్‌లో ఉన్న క్యాంటీన్ల వద్ద మిగిలిన ఆహారం తింటూ ఇక్కడ శునకాలు జీవిస్తున్నాయి. జీవీఎంసీ సిబ్బంది వీటిని పట్టుకుని ఇక్కడ నుంచి తరలించే ప్రయత్నం చేయాలని సందర్శకులు కోరుతున్నారు.

విక్రమ్ గౌడ్‌కు ఉగాది పురస్కారం



సీఎం చంద్రబాబు నుంచి ఉగాది పురస్కారం స్వీకరిస్తున్న విక్రమ్ గౌడ్

మద్దిలపాలెం: విశాఖకు చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి బత్తిన రంగ విక్రమ్‌కుమార్(గౌడ్)ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఉగాది పురస్కారంతో సత్కరించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాష, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. 25 ఏళ్లుగా విక్రమ్ గౌడ్ నెలకొల్పిన నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ నృత్యోత్సవాల నిర్వహణలో పేరుప్రఖ్యాతలు పొందారు. దేశ, విదేశాల్లో అనేక ప్రతిష్టాత్మకత వేదికలపై విభిన్న నృత్యోత్సవాలకు రూపకల్పన చేసి తన ప్రత్యేకత తను చాటుకున్నారు. మొక్కవోని దీక్షతో కళారంగానికి చేస్తున్న సేవలకు గానూ అందుకున్న ఉగాది పురస్కారం మరింత బాధ్యతాయుతంగా ముందుకు సాగడానికి ఊతమిస్తుందని విక్రమ్ పేర్కొన్నారు.

సీతారాముల కల్యాణానికి పందిరి రాట



సంజీవినగర్ రామాలయంలో కల్యాణ రాట వేస్తున్న స్థానికులు



కోదండ రామాలయంలో పందిరి రాట వేస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు



పాత వెంకోజీపాలెంలో కల్యాణ రాట వేస్తున్న కమిటీ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్ సంజీవినగర్ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానికులు ఆలయ ఆవరణలో సీతారాముల కల్యాణానికి పందిరి రాట వేశారు. ఉత్సవాల్లో గ్రామస్తులు పాల్గొని రాములోరి కల్యాణం తిలకించాలని సంఘం సభ్యులు కోరారు. స్థానిక మహిళలు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

ఏయూక్యాంపస్: స్థానిక బౌట్ గేట్ జోన్‌లోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు ఆలయ ఆవరణలో రాములోరి కల్యాణ పందిరి రాట వేశారు. ఈ నెల 7న ఆలయంలో సీతాదేవి సమేత కోదండ రామస్వామి దివ్య కల్యాణం జరిపిస్తారు. సోమవారం గణపతి పూజ, మండపారాధన, గోపూజ నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వన్నె రాంబాబు, కోశాధికారి రాజు, రాంబాబు, వెంకటేశ్వరరావు, బి.తిరుమలరావు, తాతారావు, అప్పారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు

మద్దిలపాలెం: పాత వెంకోజీపాలెంలోని సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణ పందిరి రాటను స్థానికులు వేశారు. సంఘ అధ్యక్షుడు వెంకటసూరి అప్పారావు కల్యాణ దంపతులు, ఆలయ ప్రధానార్చకుడు రంపా రామ్మోహన్ శర్మ దంపతులు ఉడుపు రాటకు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలకు మంగళ స్నానాలు చేయించి ఆలయ ప్రాంగణంలో కొలువు ఉంచారు. తొమ్మిది రోజుల పాటు వీటికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామని కె.వి.ఎస్. అప్పారావు తెలిపారు. ఏప్రిల్ 6న శ్రీరామనవమి ఉత్సవాలను వైభవంగా జరుపుతామని చెప్పారు. గ్రామ సేవా సంఘం మాజీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానికులు, మాజీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

➡ కొత్త వెంకోజీపాలెం సీతారాముల ఆలయం వద్ద గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో, ఇసుకతోట రామాలయంలో శ్రీ సీతారామ సేవా మండలి, ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వరాలయంలో రాములోరి కల్యాణ రాటను కమిటీల సభ్యులు వేశారు.

సకల శుభాల ఉగాది

- వాడవాడలా ఘనంగా విశ్వావసు నామ సంవత్సర వేడుకలు



హెచ్‌డీపీపీ కార్యాలయంలో మురళీకృష్ణను సత్కరిస్తున్న ఆధ్యాత్మిక వేత్తలు



లలితా పీఠంలో ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు



మాట్లాడుతున్న యాదవ సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు

ఏయూక్యాంపస్: విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండగను ఆదివారం కుటుంబ సమేతంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వారి గోత్రనామాలతో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉగాది పచ్చడిని ప్రసాదంగా అందించారు. తెలుగు వారి కొత్త ఏడాదిలో అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షిస్తూ ఆలయాలలో విశేష పూజలు జరిపారు. కిర్లంపూడి లేఅవుట్‌లోని శ్రీ లలితా సుందరేశ్వర పీఠంలో లలితా దేవికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకుడు కాందూరి లక్ష్మణస్వామి పంచాగ శ్రవణం చేశారు. ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాముల విగ్రహాలను అలంకరించారు.

తెలుగుదనాన్ని చాటిన ఉగాది సంబరాలు

తెలుగు వారి సంప్రదాయాన్ని వెలుగెత్తి చాటేలా బీచ్ రోడ్డులోని సెంచరీ క్లబ్ ఆవరణలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ ఏర్పాటు చేసిన ప్రత్యేక సెట్‌లు ఎంతగానో ఆకట్టుకున్నాయి. భారతీయ జానపద కళలు, గంగిరెద్దులు, సంప్రదాయ చేతి వృత్తులను ఇక్కడ ప్రదర్శించిన విధానం అందరినీ ఆకట్టుకుంది. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం క్లబ్ సభ్యులకు తెలుగువారి సంప్రదాయ పిండివంటలతో విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సహకరించిన అందరికీ క్లబ్ కార్యదర్శి వాసిరెడ్డి శ్రీమంత్ కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్‌డీపీపీ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం

ఎంవీపీకాలనీ: ఉగాది పర్వదినం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంవీపీ కాలనీలోని హెచ్‌డీపీపీ కార్యాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. బ్రహ్మశ్రీ కలగ మురళీకృష్ణ పాల్గొని విశ్వావసు నామ సంవత్సర పంచాంగ పఠనం చేశారు. కార్యక్రమంలో నగరానికి చెందిన ఆధ్యాత్మిక వేత్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పంచాంగ శ్రవణాన్ని వీక్షించారు. అనంతరం హెచ్‌డీపీపీ ఉద్యోగులు, ఆధ్యాత్మిక వేత్తలు మురళీకృష్ణ ఘనంగా సత్కరించారు. ఎంవీపీ కాలనీతోపాటు హెచ్‌డీపీపీ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పాపయ్యపాలెంలోని శ్రీరామాలయం, అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం, సింగరాళ్లపాడు గ్రామంలో పంచాంగ శ్రవణం కార్యక్రమాలు నిర్వహించారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు

మద్దిలపాలెం: విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి బొట్టా వెంకటరమణల ఆధ్వర్యంలో శివాజీపాలెంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాగ శ్రవణం చేశారు. అనంతరం జరిగిన సభలో సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ యాదవుల సంక్షేమానికి సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. వేడుకల్లో సంఘ ప్రతినిధులు ఉప్పులి అప్పలకొండ, యడ్ల వేణుగోపాల్, డొక్కార శ్రీను, పిన్నింటి ఆదిమూరి, ప్రకృతి సన్యాసిరావు, పల్లా రమేష్, ఒమ్మి అప్పారావు, యాదవ సంఘం పెద్దలు పాల్గొన్నారు.



సెంచరీ క్లబ్ ఆవరణలో పల్లె వాతావరణాన్ని తలపించే సెట్



గంగిరెద్దు, డూడూ బసవన్నల ప్రదర్శన

సంగీత సమితి సేవలు ప్రశంసనీయం



సంగీత సమితి ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్న డాక్టర్ రవిరాజు, అతిథులు

సీతంపేట: ఐ.వి.ఎల్.శాస్త్రి సంగీత సమితి ప్రథమ వార్షికోత్సవం స్థానిక శంకరమఠంలో ఆదివారం ఘనంగా జరిగింది. శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ టి.రవిరాజు జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ఐ.వి.ఎల్.శాస్త్రి పేరిట సంగీత సంస్థను స్థాపించి, తద్వారా నిర్వహించిన సంగీత సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. శాస్త్రి జీవితం ఎందరికో ఆదర్శంగా నిలిచిందన్నారు. అతిథులు జి.ఆర్.కె.ప్రసాద్, వీవీబీ శంకరం, వి.ప్రకాశరావు సంగీత సమితి సేవలను కొనియాడారు. సంస్థ శిష్య బృందం ఆలపించిన సంకీర్తనలు, భక్తి గీతాలు ఆహుతులను రంజింపజేశాయి. ఐ.వి.ఎల్.సంగీత సమితి చైర్మన్ ఆకొండి వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, కె.సుబ్రహ్మణ్యం, పి.జగన్‌మోహన్‌రావు, వి.మధుసూదనరావు, జి.మధుబాబు, ఎం.నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, శంకరమఠం వేద విద్యార్థులు, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

అలరించిన విశ్వావ'సుకవి' సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

సీతంపేట: విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు ఆధ్వర్యంలో ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన విశ్వావసు కవి సమ్మేళనం ఆహుతులను అలరించింది. వ్యాఖ్యాత రాంభట్ల నృసింహశర్మ నిర్వహణలో పలువురు కవులు, రచయితలు ఉత్సాహంగా పాల్గొని తమదైన శైలిలో కవిత్వంతో రంజింపజేశారు. ఈ సందర్భంగా రఘురామారావు మాట్లాడుతూ సాహిత్యం, సంగీతం, కళారూపాలు, భారతీయ సంస్కృతి ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో కళాతపస్వి కె.విశ్వనాథ్ చేతుల మీదుగా 2010లో విశాఖ రసజ్ఞ వేదిక స్థాపించామన్నారు. గడిచిన 15 ఏళ్లలో 150కి పైగా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. విశాఖ రసజ్ఞ వేదిక 15 ఏళ్ల వైభవాన్ని పురస్కరించుకుని ఉగాది సందర్భంగా విశాఖలోని 24 మంది తెలుగు కవులను సత్కరించి, వారి చేత విశ్వావ'సుకవి' సమ్మేళనం నిర్వహించామన్నారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, కోలవెన్ను మలయవాసిని, డి.వి.సూర్యారావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, పేరి రవికుమార్, వెలమల సిమ్మన్న, మీగడ రామలింగస్వామి, ఈదర పెదవీర్రాజు తదితరులు కవిత్వంతో అలరించారు.

తల్లికి వందనం ఎక్కడ? 96 గజాల స్థలం ఏదీ?

సీపీఎం జగదాంబ జోన్ కమిటీ సూటి ప్రశ్న

డాబాగార్డెన్స్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సీపీఎం జగదాంబ జోన్ కమిటీ కన్వీనర్ ఎం. సుబ్బారావు ఆదివారం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ వినూత్నంగా ప్రదర్శన చేపట్టారు. తల్లికి వందనం ఎక్కడ? 96 గజాల స్థలం ఏదీ? మహిళలకు ఇవ్వాల్సిన రూ.15వేలు ఎవరి ఖాతాలో పడ్డాయి? గ్యాస్ సిలిండర్ల డబ్బులు ఎంత మందికి వచ్చాయి? మహిళలకు ఉచిత బస్సు తుస్సేనా? కరెంటు చార్జీలు పెంచమని చెప్పి మాట తప్పిన అంశం.. స్మార్ట్ మీటర్ల పరిస్థితి ఏంటి? అంటూ ఎన్నో ప్రశ్నలు కూటమి ప్రభుత్వంపై సంధించారు. సిటు నాయకుడు వై. రాజు నేతృత్వంలో కళాఖండాలు ప్రదర్శించారు. జగదాంబ జోన్ ఇన్‌చార్జి పి. మణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిందని, 6 గ్యారంటీలు నెరువేరుస్తామని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని ప్రైవేట్‌పరం చేయబోమని, సొంత గనులు ఇప్పించే బాధ్యత తీసుకుంటామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల కోసం మాట్లాడకపోవడం సిగ్గు చేటన్నారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనుల కోసం ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి చంద్రశేఖరం మాట్లాడుతనూ మత్స్యకారుల వేట నిషేధ కాలంలో వారి భృతి రూ.20 వేలకు పెంచుతామని చెప్పి, ఇంత వరకు ఇవ్వకపోవడం, కనీసం సర్వే కూడా చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు కె. గణేష్, సంతోష్‌కుమార్, సంజయ్, సిటు నాయకుడు చంద్రమౌళి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు కె. నర్సింగరావు, సిమ్మనాయుడు, రామకృష్ణారావు, సూరీడు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

పీఎంపాలెం: ఉగాది ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. నగరంలోని జ్యోష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జస్మిత, నవ్య, చరిష్మా, మోహన, మశ్విత, పావని, గీతిక తదితర బాల కళాకారులు ప్రతిభ చాటుకున్నారు.